క్లుప్తంగా

కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం



టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు

కొలిమిగుండ్ల: అల్ట్రాటెక్ కమ్యూనిటీ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తుమ్మలపెంట సమీపంలోని కార్యాలయంలో సోమవారం మహిళల కోసం ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే ఇక్కడ శిక్షణ తీసుకున్న పలువురు మహిళలు స్వంతంగా టైలరింగ్ పని చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. మరింత మంది మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భూఆక్రమణపై సర్వే



ప్రభుత్వ భూమి ఆక్రమణపై విచారణ జరుపుతున్న ఎస్‌ఐ

కోవెలకుంట్ల: మండలంలోని బిజనవేముల గ్రామ శివారులో ప్రభుత్వ భూమి ఆక్రమణపై సోమవారం అధికారులు సర్వే నిర్వహించారు. గ్రామానికి చెందిన రజకులు దోబీఘాట్ల ఏర్పాటు చేసుకునేందుకు 30 ఏళ్ల క్రితం 1.88 ఎకరాల బంజరు భూమిని కేటాయించారు. కొన్నేళ్ల క్రితం టీడీపీ వర్గానికి చెందిన ఓ వ్యక్తి భూమిని ఆక్రమించుకుని సాగుభూమిగా మార్చుకున్నాడు. ఆ భూమిని ఎలాగైనా సొంతం చేసుకోవాలన్న ఉద్దేశంతో ఇటీవల ఫెన్సింగ్ పనులు మొదలు పెట్టాడు. విషయం తెలుసుకున్న రజకులు తహసీల్దార్ పుష్పకుమారికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సర్వేయర్లు భూ కొలతలు చేపట్టి ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించారు. రెండు రోజుల్లో ఫెన్సింగ్ తొలగించి రజకులకు కేటాయించిన భూమిని వారికే చెందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

బనగానపల్లె రూరల్: స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయ ఆవరణంలో రహదారులు భవనముల శాఖ వర్క్‌చార్జ్‌డు ఉద్యోగుల సంఘ మండల కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి డి సత్యవతి, పరిశీలకులు ఎ కొండయ్య ఆధ్వర్యంలో సంఘంగా మండల అధ్యక్షులుగా ఎం దేవదాస్, సెక్రటరీగా ఎస్ ఎండీ ఖలీలు, ట్రెజరర్ అల్తాఫ్‌హుస్సేన్, ఉపాధ్యక్షులుగా జమాల్‌వలి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా షేక్ ఇమాంబి, ఎస్ నసీమ్‌బిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

క్రికెట్ బ్యాట్ల అందజేత



క్రీడాకారులకు క్రికెట్ బ్యాట్లను పంపిణీ చేస్తున్న ఓబులరెడ్డి

బనగానపల్లె/కోవెలకుంట్ల: నియోజకవర్గంలోని అవుకు మండలం గుండ్లశింగవరం, గోకులదిన్నె కోవెలకుంట్ల మండలం అమడాల, కంపమళ్ల, సంజామల మండలం రెడ్డిపల్లె గ్రామాలకు చెందిన క్రీడాకారులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎమ్మెల్యే రామిరెడ్డి తనయుడు ఓబులరెడ్డి ఉచితంగా క్రికెట్ కిట్లను అందజేశారు. సోమవారం బనగానపల్లెలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అత్తార్ జాహెద్ హుస్సేన్, సోముల వెంకటేశ్వరరెడ్డి, ఖానిక్, అత్తార్‌అఖిల్‌హుస్సేన్, మోహన్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, శివ, నాగరాజు, మదార్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయాలి




పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏపీఎన్జీఓ నాయకులు

బనగానపల్లె రూరల్: ఈ నెల 21, 22వ తేదీలో విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏపీఎన్జీఓ బనగానపల్లె డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేశ్వర్లు, సెక్రటరీ అల్తాఫ్ హుస్సేన్ విజయవంతం చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలను కోరారు. సభలకు సంబంధించిన పోస్టర్లను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఆవిష్కరించారు.

తెల్లదొరల పాలిట సింహస్వప్నం

- విప్లవ వీరుడు.. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి
- బ్రిటీషర్ల నిరంకుశ పాలనపై 1842లోనే తిరుగుబాటు బావుటా
- తహసీల్దార్‌ను నరికి చంపి, బ్రిటీష్‌వారి ఖజానాను కొల్లగొట్టిన ధీరుడు



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఊహాచిత్రం

కోవెలకుంట్ల: దేశానికి స్వాతంత్య్రం సిద్ధింపజేసేందుకు బ్రిటీష్‌వారిపై తిరుగుబాటు బావుట ఎగురవేసిన మొదటి విప్లవ వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి. బ్రిటీష్‌వారి కబంధ హస్తాల నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు నరసింహారెడ్డి విప్లవ మార్గాన్ని ఎంచుకుని వారిపై తిరుగుబాటు చేశాడు. నరసింహారెడ్డి వీర మరణం పొంది 176 ఏళ్లు కావస్తున్నా తెల్లదొరలపై పోరాటం చేసేందుకు ఏర్పాటు చేసిన కోట గోడలు ఇప్పటికీ చెక్కు చెదరలేదు. బ్రిటీష్‌వారిని గడగడలాడించిన నరసింహారెడ్డి రేనాటి సూర్యుడిగా, దానకర్ణుడు బుడ్డా వెంగళరెడ్డి రేనాటి చంద్రుడిగా 2002వ సంవత్సరం తంగిరాల సుబ్బారావు రేనాటి సూర్యచంద్రుల గ్రంథాన్ని ఆవిష్కరించారు.


సైరా నారసింహారెడ్డి

ఉమ్మడి కర్నూలు జిల్లా ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన సీతమ్మ, పెద్దమల్లారెడ్డి దంపతుల కుమారుడు నారసింహారెడ్డి. హైదరాబాద్ నవాబులు రాయలసీమ జిల్లాలైనా కర్నూలు, కడప, అనంతపురం, బళ్లారిని దత్తత మండలాలుగా ప్రకటించి బ్రిటీష్‌వారికి ధారాదత్తం చేశారు. నొస్సం ప్రధాన కేంద్రంగా బ్రిటీష్ పాలన కొనసాగేది. నారసింహారెడ్డి తాత జయరామిరెడ్డికి పన్నులు, భూమిశిస్తూ వసూలు చేసే అధికారం అప్పగించారు. ఆయన మరణానంతరం వారసత్వంగా ఈ బాధ్యత నారసింహారెడ్డికి వర్తించింది. బ్రిటీషర్ల నిరంకుశ పాలనను ప్రతిఘటించి మొదటిసారిగా 1842లో వారిపై తిరుగుబాటు బావుటా ఎగరవేశాడు. నారసింహారెడ్డి తిరుగుబాటుకు బ్రిటీష్ సామ్రాజ్యం గజగజ వణికిపోయింది. తనపోరాటంలో కోవెలకుంట్ల తహసీల్దార్‌ను నరికి చంపడమేకాక బ్రిటీష్‌వారి ఖజానాను కొల్లగొట్టారు. దీంతో ఈయనను పట్టించిన వారికి 10 వేల దినారాలు బహుమతి అందజేస్తామని బ్రిటీష్ ప్రభుత్వం ప్రకటించింది. ఎట్టకేలకు 1847లో సంజామల మండలం జగన్నాథగుట్టపై నారసింహారెడ్డిని ప్రాణాలతో పట్టుకుని బందిపోటు దొంగగా ముద్రవేసి 1847 ఫిబ్రవరి 22న కోవెలకుంట్ల పట్టణ సమీపంలోని జుర్రేరు ఒడ్డున ఉరిశిక్ష అమలుపరిచారు. అయితే నారసింహారెడ్డి మరణించి వందేళ్లకు స్వాతంత్య్రం సిద్ధించింది. నాటి నుంచి భారతీయులు ఆయనను రేనాటి సూర్యుడిగా పిలుచుకుంటుంటారు. ఇప్పటికి కూడా రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లలో నరసింహారెడ్డి పేరుపై సైరా నారసింహారెడ్డి.. నీపేరే బంగారు కడ్డీ లాంటి జానపద గేయాలు వినిపిస్తుండటం ఆయన వీరత్వానికి ప్రతీక.



నరసింహారెడ్డి వినియోగించిన ఫిరంగి

కోవెలకుంట్లలో నరసింహారెడ్డి విగ్రహం



కోవెలకుంట్లలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం

బ్రిటీష్ పాలనలో కోవెలకుంట్ల పట్టణంలోని ప్రస్తుత గాంధీసెంటర్ సమీపంలో ట్రెజరీ ఏర్పాటు చేసుకున్నారు. 1846లో నరసింహారెడ్డి ఈ ట్రెజరీపై దాడి చేసి 805 రూపాయల 10 అణాల నాలుగుపైసలను కొల్లగొట్టారు. ట్రెజరీపై దాడికి గుర్తుగా ఆ ప్రాంతంలో 2012లో పట్టణానికి చెందిన హైకోర్టు న్యాయవాది చిన్న ఎల్లారెడ్డి ఆర్థిక సహకారంతో నరసింహారెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసి అప్పటి నుంచి ఏటా వర్ధంతిని నిర్వహిస్తున్నారు. ఇక ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్రను వెండితెరపైకి ఎక్కించారు. చిరంజీవి కథానాయకుడిగా నాలుగేళ్ల క్రితం సైరా నరసింహారెడ్డి పేరుతో చలనచిత్రం విడుదలైంది.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

అవుకు: మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయ భవనం ఆవరణంలో పొదుపు మహిళలు, వైకేపీ కార్యాలయ సిబ్బంది సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఇటీవల సెర్ప్ ఉద్యోగులకు మూలవేతనంలో 23 శాతం వేతనం పెంచుతున్నట్లు సీఎం ప్రకటించారని, ఆయనకు రుణపడి ఉంటామని పలువురు పేర్కొన్నారు.

ముచ్చట్లలో మాస శివ రాత్రి పూజలు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన ముచ్చట్ల భ్రమరాంభ, మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం మాస శివ రాత్రి పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుడు చంద్రమోహన్ రావు ముచ్చట్ల మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ముగిసిన ఉప ఎన్నికల ఘట్టం

- నామినేషన్ల ఉప సంహరణతో నాలుగు వార్డు స్థానాలు ఏకగ్రీవం



కనకాద్రిపల్లె సర్పంచ్ శివశంకర్‌కు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న నందివర్గం 1వ వార్డు సభ్యుడు మహేష్



అల్వకొండలో కేసినేని మురళిగౌడుకు ధ్రువీకరణపత్రాన్ని అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి



కోవెలకుంట్ల ఆరవ వార్డుమెంబర్‌గా డిక్లరేషన్ అందుకుంటున్న కాల్వ శ్రీవాణి



అన్నవరం సర్పంచ్ సాయినాథ్‌రెడ్డికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి

కోవెలకుంట్ల: మండలంలో ఖాళీ అయిన వార్డు స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికల ఘట్టం సోమవారంతో ముగిసింది. కోవెలకుంట్ల పంచాయతీ ఆరవ వార్డు, చిన్నకొప్పెర్ల, సొదరదిన్నె, కలుగొట్ల గ్రామాల్లో ఒక్కో వార్డు స్థానాలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. కోవెలకుంట్ల స్థానానికి ఎనిమిది,మిగిలి న గ్రామాల్లో ఒక్కో స్థానానికి రెండు నామినేషన్ల చొప్పున మొత్తం 14 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ఉప సంహరణ రోజున కోవెలకుంట్లలో ఏడుగురు అభ్యర్థులు వారి నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ బలపరిచిన కాల్వ శ్రీవాణి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి నరేంద్రనాథశర్మ ప్రకటించారు. చిన్నకొప్పెర్ల, సొదరదిన్నె గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు మాబాషా, అల్లూరి రహినాబీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారులు వెంకటసుబ్బయ్య, వెంకట్రామిరెడ్డి ప్రకటించారు. గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కలుగొట్ల గ్రామంలో టీడీపీ బలపరిచిన వార్డుమెంబర్ మృతి చెందగా ప్రస్తుత ఉప ఎన్నిక సందర్భంగా వార్డు స్థానానికి వైఎస్సార్‌సీపీ ఎవరిని బలపరచకపోవడంతో టీడీపీ బలపరిచిన ఇద్దరు మహిళలు నామినేషన్లు వేశారు. వీరిలో ఒకరు ఉప సంహరించుకోగా గుమ్మడి వరలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి హరీష్ పేర్కొన్నారు. ఎన్నికైన అభ్యర్థులకు ఆర్‌ఓలు డిక్లరేషన్ ఫారాలు అందజేశారు.

బనగానపల్లె మండలంలో..

బనగానపల్లె: మండలంలోని అప్పలాపురం 10వ వా ర్డు, నందివర్గం 1వ వార్డు, రామక్రిష్ణాపురం 2వ వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంపీడీఓ శివరామ య్య ప్రకటించారు. నందివర్గం మిద్దె మహేష్, అప్పలాపురం గాలి సుబ్బలచ్చమ్మ, రామక్రిష్ణాపురం బి శేఖర్‌లు ఆయా గ్రామాల ఆర్‌ఓల చేతుల మీదుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ధ్రువపత్రాలను అందుకున్నారు.

సంజామల మండలంలో..

సంజామల: మండల పరిధిలోని ఆల్వకొండ, పేరుసోముల గ్రామాల రెండు వార్డు మెంబర్లు ఏకగ్రీవమైనట్లు రిటర్నింగ్ అధికారులు తెలిపారు. ఆల్వకొండ 1వ వార్డు స్థానానికి మూడు నామినేషన్లు దాఖలు కాగా కుమ్మరి శ్రీనువాసులు, పగడాల ప్రసాదు ఉపసంహరించుకోవడంతో మురళి గౌడు ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు రిటర్నింగ్ అధికారి పాపరాయుడు తెలిపారు. పేరుసోముల గ్రామంలో రెండవ వార్డు స్థానానికి బి సునిత మాత్రమే నామినేషన్ వేయడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేరుసోముల రిటర్నింగ్ అధికారి ఉపేంద్ర రెడ్డి ప్రకటించారు. ఆకుమల్ల గ్రామంలో పదో వార్డు స్థానానికి నాలుగు నామినేషన్లు దాఖలు కాగా ఇద్దరు ఉపసంహరించుకోవడంతో మిగతా ఇద్దరు స్వరూప, శ్రీరాములు బరిలో ఉన్నారని ఎన్నికల రిటరిన్నింగ్ అధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు.

అన్నవరం సర్పంచ్ స్థానం ఏకగ్రీవం

అవుకు: మండలంలోని అన్నవరం పంచాయతీ సర్పంచ్‌గా మాదిరెడ్డి సాయినాథ్ రెడ్డి, కొండమనాయునిపల్లె 7వ వార్డు మెంబర్‌గా ముడావత్ బాలు నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు. ఈ రెండు స్థానాలకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో వారి ఎన్నిక లాంఛనమైందన్నారు. రామాపురంలో 2వ వార్డుకు నాలుగు నామినేషన్లు దాఖలు కాగా ముగ్గురు విత్ డ్రా చేసుకోగా వడ్డె చౌడేశ్వరి ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు.

కొలిమిగుండ్ల మండలంలో..

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కనకాద్రిపల్లె సర్పంచ్‌గా బోయ శివశంకర్, అంకిరెడ్డిపల్లె వార్డు మెంబర్‌గా నంద్యాల ఈశ్వర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. బెలుం నాల్గవ వార్డు స్థానానికి కొండా మహేశ్వరి, రాములమ్మ బరిలో ఉన్నారని అధికారులు తెలిపారు.

ప్యాపిలి మండలంలో..

ప్యాపిలి: మండల పరిధిలోనిఏడు వార్డు మెంబర్ల స్థానాలకు గానూ ఐదు వార్డు స్థానాలు ఏకగ్రీవమైనట్లు ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ ప్రకటించారు. ఎస్ రంగాపురం, కొలుపల్లి, నల్లమేకలపల్లి పంచాయతీల్లోని మూడు వార్డుల నుంచి వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు లక్ష్మిదేవి, తలారి ప్రభాకర్, లక్ష్మీదేవి వార్డు మెంబర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలేబాదు, మాధవరం గ్రామాల్లోని వార్డు స్థానాలకు గ్రామస్తుల ఏకాభిప్రాయంతో ఉమ్మడి అభ్యర్థులుగా శివరాముడు, కృష్ణవేణిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా ప్యాపిలి 2వ వార్డు, అలేబాదుతండాలో 7వ వార్డుల ఈ నెల 19న ఉప ఎన్నిక జరగనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

సెల్ఫీ ఛాలెంజ్‌లు కాదు .. చర్చకు రండి

- రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు



మాట్లాడుతున్న రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు

డోన్: సెల్ఫీ ఛాలెంజ్‌లు కాదు దమ్ముంటే నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు రావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డికి రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు సవాల్ విసిరారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శ్రీరాములు మాట్లాడారు. రైల్వే అండర్ పాస్ బ్రిడ్జితో పాటు ఉడుములపాడు వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపం ఏర్పాటు కోసం ఇటీవల మంత్రి బుగ్గన భూమిపూజ చేశారన్నారు. అక్కడ ధర్మవరం సుబ్బారెడ్డి సెల్ఫీ తీసుకుని శిలాఫలకాలు ఎక్కడంటూ ప్రజలను తప్పుదోవ పట్టించేలా మంత్రిపై ఆరోపణలు చేయడం తగదన్నారు. ముందుగా భూమి పూజకు, శిలాఫలకాల ఏర్పాటుకు తేడా తెలుసుకోవాలని హితవు పలికారు. మోడల్, ఏపీ రెసిడెన్షియల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంతో పాటు కోట్ల, వైఎస్, ఆటో, సుజాతమ్మ, ఆర్యవైశ్య కాలనీలు, కోట్ల అవుట్‌డోర్ స్టేడియం, హంద్రీనీవా కాల్వ పనులు, డోన్ నియోజకవర్గ తాగునీటి పథకం వైఎస్‌ఆర్ చొరవ వల్లే మంజూరైన విషయాన్ని కాదనే దమ్ము, ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. కేవలం నాలుగేళ్లలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి రూ.2,400 కోట్లతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. అభివృద్ధిపై చర్చకు రావాలని, లేకపోతే ముక్కు నేలకు రాసి, ప్రజలకు క్షమాపణలు చెప్పి, రాజకీయాల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.

సొంత గ్రామానికి ఏమి చేశావో చెప్పు..

ఇరవై ఏళ్లపాటు రాజకీయంలో ఉన్న సుబ్బారెడ్డి సొంత గ్రామం ధర్మవరానికి ఏం చేశారో ఆ గ్రామ నడిబొడ్డున నిలబడి ప్రజల సమక్షంలో చెప్పాలన్నారు. కనీసం సెల్ టవర్ కూడా వేయించుకోలేకపోతే బుగ్గన చొరవతో సెల్ టవర్ ఏర్పాటైన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, మునిసిపల్ కౌన్సిలర్ దినేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం జెడ్పీహెచ్ పాఠశాల 1991–92 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు సోమవారం పాఠశాలలో సమావేశమయ్యారు. 32 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని, ఆనాటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. ఆరోజుల్లో తమకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంతోనే తాము ఇంత స్థాయికి ఎదిగామని పలువురు పూర్వ విద్యార్థులు చెప్పడంతో వారికి చదువు చెప్పిన గురువులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం తమ గురువులైన రిటైర్డ్ ఎంఈఓ నారాయణ రెడ్డి, ఉపాధ్యాయుడు పిచ్చమ రాజును సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు ప్రసాద్, పటాన్ మాబుఖాన్, కురువ నాగయ్య, రామకృష్ణ, సురేష్ బాబు, విజయా రెడ్డి, విజయలక్ష్మి, పార్వతి, అనిత, సుభద్ర పాల్గొన్నారు.

వీరుల ప్రాణత్యాగంతోనే స్వాతంత్రం



మాజీ సైనికుడు శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న అధ్యాపకులు

కోవెలకుంట్ల: ఎందరో వీరుల ప్రాణత్యాగంతోనే దేశానికి స్వాతంత్రం సిద్ధించిందని ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాభూమి- నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం మాజీ సైనికుడు శ్రీనివాసరెడ్డిని పూలమాలతో సత్కరించారు. పంచ్రాగస్టును పురస్కరించుకుని జాతీయ పతాకానికి హారతులు, దేశం కోసం పాటు పడతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో న్యాక్ సమన్వయ కర్త భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామ పాణ్యం సిమెంట్ హైస్కూల్ ఆవరణంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మహేశ్వర్ రెడ్డి, ఏపీఓ శేషన్న ఆధ్వర్యంలో నా భూమి– నాదేశం కార్యక్రమం నిర్వహించారు. శిలాఫలకం ఏర్పాటు చేసి నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్తేరమ్మ, ఉప సర్పంచ్ మమత తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె: మండలంలోని పలుకూరు గ్రామంలో నా భూమి – నా దేశం, నేల తల్లికి నమస్కారం–వీరులకు వందన కార్యక్రమం నిర్వహించారు. జన్మనిచ్చిన తల్లిని, జన్మభూమిని, స్వాతంత్ర సమర యోధులను ఎన్నటికీ మరవరాదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి అన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ కోనేటి సుమలత పాల్గొన్నారు.